# స్వీకృతి

by అక్షర

రోహిణి శాయి ప్రేమించే పెళ్ళి చేసుకున్నారో, పెళ్ళిచేసుకుని ప్రేమించుకున్నారో తెలీదుగాని, పెళ్ళయ్యాక పాతకాలం వాళ్ళ దృష్టిలో పాలునీళ్ళల్లాగ, కొత్తతరం వాళ్ళ దృష్టిలో విస్కీసోడాలాగా కలిసిపోయి, కాని వాళ్ళ కళ్ళల్లో నిప్పులు, అయిన వాళ్ళ మనసుల్లో ముచ్చట పడేంత అందమైన, అనుకూలమైన జంటగా ప్రసిద్ధి చెందారు. అందుకే వీళ్ళకో వరాలపంట సిద్ధం.

ఇద్దరి అన్యోన్యాన్ని చూసి ముచ్చట పడేవారి లిస్టులో యెదురింటి పిన్నిగారొకరు. పిన్నిగారింటిలోనూ వోవరాల పంట సిద్ధమౌతోంది. వరసలు కలిపేసే వరవడికల వారితరంలోది కాబట్టి, రోహిణిని కూతురి స్థానంలో కూర్చోబెట్టి, తన కోడలు కూతురు వరాల పంటిల్లి ఎప్పుడిస్తారా! అని ఆనందంతో తబ్బిబ్బవుతోంది. ఆవిడ, ఆనందానికి తగ్గట్టుగానే రోహిణికి ఎదురింటి పిన్నిగారంటే గౌరవం. ఆవిడిచ్చే పిండివంటలు రుచిగా వుంటాయన్న అభిప్రాయమూ వుంది.

కోడలి కోసం యేంచేసినా యేంతెచ్చినా "నా కూతురి వాటా" అంటూ రోహిణి వంతు ఠంచనుగా రోహిణికిచ్చి తన పెద్దరికం, అభిమానం ఢంకా మోగించి చూపేది పక్కింటి పిన్నిగారు.

పక్కింటి పిన్నిగారు రోహిణికి యేంయిచ్చినా రోహణి కన్నా ముందు, శాయి రుచి చూడడం పరిపాటు. శాయి పక్కింటి పిన్నిగారి వంటకాలకి అలవాటు పడి "ఈ రోజు మీ పిన్నిగారు యేంపంపలేదా?" అంటూ వాకబు చెయ్యడం.... "చూసావా పెళ్ళాం కడుపుతో వుండడం నీకే లాభం ... రుచి అన్నపేరుతో మూడొంతులు నువ్వే తినేస్తున్నావు" అంటూ రోహిణి దెప్పడం ... "నీ కేరియంగ్‌కి సగం కర్తని నేనే కదోయ్, నీ కొచ్చేవన్నింటిలో సగం వాటా నాదే" అంటూ శాయి సినీమా స్టయిల్లో గడుసుపోడం ఆ యింట్లో నిత్యవేడుకైంది.

అయితే శాయి గడుసుతనాన్ని దెబ్బతీయగల సత్తా రోహిణికుందని శాయికి తెలీదు. అందులో భాగంగానే "శాయీ పిన్నిగారు మల్లెచెండిచ్చారు. సగంనీది కదా నాకంటే జడుంది. పెట్టుకుంటా! నీకెక్కడ పెట్టను. సుల్తానుగారు చెప్పినట్టు తలకి మేకుకొట్టి పెట్టనా?" అనడిగేది నవ్వుతూ. యింకోసారి శాయి నిద్రలేచేసరికి చేతికి గలగట్టాడుతూ గాజులు కనిపించాయి "యిదేమిటి?" అని ఆశ్చర్యపోయిన శాయిని చూసి "యెదురింటి పిన్నిగారు వాళ్ళ కోడలికి గాజులేయించారు, నాకూ వోడజను గాజులిచ్చారు. అందులో సగం నీకు కదా నీ సగం నీకు తొడిగేసా, ఫర్వాలేదు వుంచుకో" అంటూ చిలిపిపోతున్న రోహిణి, శాయి మనసుకి హాయిని వూహలకి కలల దూకుడ్ని కలిగించి, యిద్దర్నీ మరిగించి, మరుకేళి రసానందంలో ముంచెత్తేవి.

ఇద్దరి అందమైన కలా రంగుల చిత్రంగా రూపుదిద్దుకుంటున్నదనే ఆనందపు వూహలకి, పక్కింటి పిన్నిగారి అభిమానపుపోకడ్లు శాపంగా వెన్నాడతాయని తట్టలేదు. తట్టే అవకాశంలేదు కూడా!

రోహిణికి తొమ్మిదోనెల రాగానే, పల్లెటూర్లో సరైన ఆస్పత్రి సదుపాయాలు వుండవని, పురిటికి సాయం కోసం, అత్తగార్నే తమ దగ్గరకు రప్పించాడు శాయి. రోహిణి తల్లి రోహిణికి పురుడుపోసిన తర్వాత, వో పది రోజులు మాత్రం రోహిణి దగ్గరవవుండి, పురిటి స్నానం అవగానే రోహిణిని చూడ్డానికి వచ్చిన బంధువులతో వెళ్ళిపోయింది.

రోహిణి పాపకి "కృప" అని పేరు పెట్టింది. తెల్లటి పొత్తిళ్ళలో విడీవిడని పిడికిళ్ళతో కృప నిజంగా కృపారసం మూర్తీభవించనట్టుగా వుంది.

రోహిణికి పురుడొచ్చిన రెండోరోజే, యెదురింటి పిన్నిగారి కోడలు, మగపిల్లవాడ్ని కంది. పిన్నిగారు మనవడ్ని చూసుకోవాలని తొందరపడడంతో, కోడలు పుట్టింటివారు బాబుకి నెలరోజులు దాటకుండా తీసుకొచ్చి దిగబెట్టారు.

రోహిణి కష్టాలు పురిటినొప్పులతో తీరాయో, మొదలయాయో అర్థంకాలేదు. రోజులుగడుస్తున్నా కృప తనంతట తాను పాలుతాగే ప్రయత్నం చెయ్యలేదు. యెన్నోసార్లు కృపనోట్లో రొమ్ము పెట్టి, కృప చప్పరించేటట్టు చెయ్యడానికి ప్రయత్నం చేసింది రోహిణి, కానీ కృపలో ఆ ప్రయత్నం యేదీ కనిపించలేదు!

యెదురింటి బాబు రావడంతో కృప పాలు తాగలేకపోతోందన్న అనుమానం, బాబుని గమనించి తెలుసుకోవచ్చని రోహిణికి తట్టింది. గుండెల్ని తడుముతూ పాలు తాగే బాబు చిలిపి చేష్టలు, కళ్ళవెలుగూ, కృపలో లోపించాయని అర్థం చేసుకుంది. అదే విషయం శాయితో చెప్పింది. "అందరు పిల్లలూ వొకలా వుండరు" అంటూ రోహిణి అనుమానాన్ని కొట్టిపారేసాడు శాయి.

కానీ శాయిని హెచ్చరించడానికా అన్నట్టు కృప ఆరోగ్యం చెడింది. యిన్డైజేషన్ వల్ల విపరీతంగా విరోచనాలు అయాయి. కృప ఆరోగ్యం చెడడానికి కారణం పోతపాలేయో అన్న అనుమానం వచ్చింది యిద్దరికీ. యెదురింటి పిన్నీగారు కూడా అదే అనుమానాన్ని వెలిబుచ్చారు. కానీ రోహిణి చెప్పినట్టు కృపకి పాలు తాగడం రాలేదు అన్న సమర్థనని పట్టించుకోలేదు. "చిన్న పిల్లలకి నాలుగైదు రోజుల నుండి చీకడం అలవాటవుతుంది. పాలు తాగకపోడం యేమిటి! రోహిణి అందం పాడైపోతుందని పిల్లకి పాలివ్వకుండా, పోతపాలు అలవాటు చేసి యిలా చెప్తోంది. ఈవిడ అందం మాట యెలా వున్నా, పిల్ల ఆరోగ్యం చెడగొట్టారు" అంటూ కోడలి దగ్గర బాధపడింది.

డాక్టరు కృపని పరీక్ష చేసి విరోచనాలకి మందిచ్చి కృపకి రిఫ్లెక్స్‌యేక్షన్స్ సరిగా లేవని యేదేనా న్యూరో సర్జెన్ దగ్గరకి తీసుకెళ్ళమని సలహా యిచ్చాడు.

కృపకి అజీర్ణం తగ్గిందికానీ మామూలు పిల్లల్లా లేదు. కృపలో లోపం యిద్దరినీ కృంగదీస్తోంటే... యెదురింటి పిన్నిగారు "మనవడు బోర్లాపడ్డాడు" బొబ్బట్లు చేసాం అంటూ దంపతులిద్దరికీ చెరి రెండు బొబ్బట్లు తెచ్చి యిచ్చింది.

రోహిణికి బోర్లాపడ్డం అంటే యేమిటో అర్థం కాలేదు. వెళ్ళిచూసింది. బాబు కేరింతలు కొడుతూ అతి కష్టం మీద బోర్లా పడ్తున్నాడు. యెటు బోర్లా పడ్తున్నాడో ఆ పక్క చెయ్యి పొట్టకింద వుండిపోతోంది. దాన్ని తీసుకోడం సాధ్యం కాక, కేర్ కేర్ మంటున్నాడు. రెండురోజులు బోర్లాపడ్డా చెయ్యి తీసుకోలేక "కేర్ కేర్"మన్న

బాబు మూడోరోజు నుండీ చెయ్యి పొట్ట కింద నుండి తీసి కాళ్ళూ చేతులూ గాలిలో వూగిస్తూ, ఆనందపడుతున్నాడు, యేదో సాధించానన్న వాడి ఆనందం కళ్ళల్లోనూ, నోటిలోంచి జారుతున్న చొంగలోనూ, వాడి కేరింతల్లోనూ స్పష్టంగా కనబడుతోంది.

నాలుగైదు రోజులుగా బాబుని గమనిస్తున్న రోహిణి, బాబులో చురుకుదనం కళ్ళల్లో మెరుపు కృపలో వెదుకుతోంది. కృప బోర్లాపడ్డం లేదు సరికదా  యెక్కడ పడుకోబెడ్తే అక్కడ నిర్లిప్తంగా చూస్తూ పడుకుంటోంది. కృప కళ్ళు వెలుగుతున్న దివిటీల్లాకాక ఆరిపోయిన గాజు బల్బుల్లా వున్నాయి. తను ప్రయత్నం చేస్తే కృప బోర్లాపడ్డం నేర్చుకుంటుందేమో? అని కృపని బోర్లా తీసింది. కృప బోర్లాపడింది. కానీ పడ్డది పడ్డట్టే వుంది. పొట్టకింద చెయ్యి తీసుకోలేదు. చెయ్యినొప్పెట్టిందని యేడవనూ లేదు. అన్నింటికీ మించి బాబు శరీరంలో నిగారింపు, చేవ కృప శరీరంలో కనిపించలేదు. కృప శరీరం జవ జవలాడుతూ జజ్జుపడి మెత్తగా వుంది. యేదో బల్లినో తొండనో ముట్టుకున్న అనుభూతి కలిగింది రోహిణికి.

కృప విషయంలో ఆందోళన చెందుతుండగా, మళ్ళీ కృప ఆరోగ్యం చెడింది. డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళారు. డాక్టరు యెక్కువ శ్రమతీసుకోకుండా "కృప మెంటల్లీ రిటార్డెడ్. ఈ తరహా సమస్యలు సామాన్యం" అని చెప్పాడు.

డాక్టరు నిర్ధారించి చెప్పిన విషయం ఇద్దరికీ షాక్‌లా తగిలింది. కృప ఆ విధంగా పుట్టడం తమ బ్లడ్ కల్చర్‌లో లోపమే అని తెలిసి కుంగిపోయారు. "కృప మెంటల్లీ రిటార్డెడ్" అన్న నిజం మనసులో యింకడానికి చాలా సమయం పట్టింది. యింక పిల్లల కోసం ప్రయత్నం చెయ్యకోడదనే నిర్ణయానికొచ్చారు యిద్దరూ!

కృప విషయంలో నిరుత్సాహపడక మంచి ఫిజియో థెరపిష్టుకి చూపించారు. కృపని చాలా రకాలుగా పరీక్ష చేసి, "కృపలో ఐక్యూ యాభై శాతం మాత్రమే వుందని, యిలాంటి వాళ్ళని మోడరేట్లీ డిజేబుల్డ్ లెక్కలో వెయ్యచ్చని అంచేత కృపని స్లో లెర్నర్‌గా పరిగణించవచ్చని, యిలాంటి పిల్లలకి మూమూలు పిల్లలకంటే భిన్నంగా మైల్ ష్టోన్స్ చాలా ఆలస్యంగా అలవడతాయని, వాళ్ళల్లో ప్రేరణ, గ్రహణశక్తి తక్కువగా వుంటుంది. కాబట్టి ప్రతి పనినీ వొకటికి పదిసార్లు ప్రాక్టీసు చేయిస్తే వాళ్ళు నేర్చుకుంటారని" చెప్తూ కృప చేత చేయించవలసిన యెక్సర్‌సైజెస్ కొన్ని చెప్పాడు.

ఆ రోజు నుండీ రోహిణీ శాయి కృప మీద శ్రద్ధ చూసిస్తూ, ప్రతి విషయం నేర్పడం మొదలుబెట్టారు. అందులో భాగంగా కృప కూర్చోడం నేర్చుకుంది.

నేర్చుకోడం, నేర్పడంకి తేడా ప్రకృతి, వికృతి! వికృతి ఎప్పుడూ వికృతే. వికృతిలో మొండితనం, వెకిలి వుంటాయి. అందుకే తనకిష్టం లేనప్పుడు కూర్చోపెడితే కీచుపెట్టి అరిచేది. కూర్చోనని మొండికేసేది.

అదే సమయంలో యెదురింటి పిన్నిగారు, మనవడు పాకురుతున్నాడు పాకుండలు చేసాము అంటూ ష్టీలు బాక్సునిండా పాకుండలు తెచ్చి యిచ్చింది. యిచ్చింది యిచ్చినట్టూ వూరుకోకుండా "మీ కృపా యేమిచేస్తోంది?" అంటూ వివరాలడిగింది.

"కృప ఆరోగ్యం బాదుండలలేదు కదండీ, మెల్లగా నేర్చుకుంటుందట డాక్టర్లు చెప్పారు" అంటూ సమాధానం చెప్పింది రోహిణి.

ఆ సమాధానం యెవర్ని సమాధానపరచడానికి, పిన్నిగారి మొహంలో "ఆ! యింకేం నేర్చుకుంటుందిలే .... "అన్న అపనమ్మకం తొంగి చూస్తే ... రోహిణి మనోకుహరాల్లో తను చెప్పిన సమాధానం మీద తనకెంత నమ్మకముంది? అన్న అనుమానం తచ్చాడింది. ఆ అనుమానం నిట్టూర్పులా మారే ప్రమాదాన్ని నివారించడానికా అన్నట్టు, పెదవుల మీద చిన్న చిర్నవ్వు అతికించుకునేది.

❋❋❋❋❋

పక్కింటి బాబు రోహిణికి మనఃశాంతి లేకుండా చేసాడు. రోహిణిని చూపించి, పక్కింటి పిన్నిగారు బాబుతో "అత్తకి జేజిపెట్టమ్మా" అని చెప్తే ..... బాబు తన చిన్నారి చేతుల్ని నుదుటి మీద పెట్టుకు, తలవంచి రోహిణికి జేజిపెడ్తూ పోయిన పోకడలు ... ముద్దులు మూటకట్టేవి!

అదే విధంగా కృప చెయ్యెత్తి బొటన వేలు నోట్లో పెట్టుకు, తల వంచేది. ఆ తల వంచడంలో వెకిలితనం కళ్ళల్లో లేకి తనం స్పష్టంగా కనబడి, రోహిణి మనసు వుసూరుమనేది.

కానీ వుసూరుమంటున్న మనసుకి వూరట కలిగించుకునే విధానం కనిపెట్టింది. అందులో భాగంగానే "శాయీ నీకోగుడ్ న్యూస్" అంటూ యెదురెళ్ళింది శాయికి వో సాయంత్రం.

అలసి సొలసిన శరీరానికి వుపశమనం మానసికోల్లాసమే! అదీ కృపలో లోపంతో కృంగిన రోహిణి వుత్సాహంతో యెదురవడం అతనికెంతో ఆశ్చర్యం కలిగించింది.

సోఫాలో కూర్చుంటూ "యేమిటి చెప్పు" అన్నాడు.

రోహిణి వుత్సాహంగా "మీ అమ్మాయికి సమయానికి పాలివ్వకపోతే కోపం వస్తోంది. పాలడబ్బా చూపించి టైమైంది పాలివ్వవేం అన్నట్టు గదమాయిస్తోంది .... " అంది.

శాయికి కుతూహలం పెరిగి "యేం జరిగింది" అంటూ ప్రశ్నించాడు. కృప కొంచెం తెలివితేటలు చూపిందన్నా, అతని మనసు సంతోషిస్తుంది.

తన అవసరాలను గుర్తించే బుద్ధికుశలత కృపలో పెరిగిందీ అంటే అతనికి మహదానందంగా వుంది.

శాయి ప్రశ్నకి కుతూహలానికి సంబరపడిన రోహిణి "కృపకి పాలు కలుపుదామని అన్నీ తెచ్చి సెంట్రల్ టేబుల్ మీద పెట్టి, టి.వి. చూడ్డంలో మునిగిపోయా, కాసేపటికి కృప నా చీర చెంగు లాగుతూ చేతిని సెంట్రల్ టేబుల్ వేపు చూపించి కేరుస్తోంది. యేమిటా అని చూస్తే కృపకి పాలివ్వలేదని తట్టింది" అంది.

ఇది అందమైన చిత్రం.... సహజమైన చిత్రానికి అందమైన చిత్రానికి తేడా వుంది. కృప డిజేబుల్డ్ అనేకాన్న స్లో లెర్నర్ అనచ్చు... వూహ పెరగడం ఆలస్యం కాని అవిటి తనం మాత్రం కాదు. ఆ ఆలోచనే అతనికి ఆనందాన్నిచ్చింది.

❋❋❋❋❋

యేడాది తిరక్కుండానే మా బాబు అడుగులేస్తున్నాడంటూ అరిసెలు పట్టుకొచ్చింది పక్కింటి పిన్నిగారు. రోహిణికి యెవరో నెత్తిమీద మొట్టినట్టయ్యింది. యేడదయేసరికి కృపకి కూర్చోడం మాత్రం వచ్చింది. దానితో పాటూ వెకిలి చేష్టలు కూడా వచ్చాయి. రోహిణి కృపతో యెన్నో ప్రాక్టీసు చేయిద్దామనుకుంది, కాని

కృప నేను చెయ్యను అంటూ బుర్రూపేది. ఆ వూపడానికి అంతంటూ వుండేది కాదు. బుర్రూపకుండా ఆపడానికి చిన్న దెబ్బేసేది. ఆ దెబ్బ పడగానే కృప మంకుగా యేడుస్తూ కూర్చునేది. ఆ యేడుపు వెకిలితనం చూసి రోహిణికి ఏడుపొచ్చేది. కాని ఏడుపు వల్ల తీరే సమస్య కాదని అర్థం అయాక కృపని అనునయించి, లాలించి, వూరుకోబెట్టేది.

యేరోజైనా కృప మూడు బావుండి, తల్లి చెప్పినట్టు వింటే, ఆ రోజు రోహిణికి పండగే, రోహిణికి పండగైతే శాయికి చిందులే!

కృప విషయంలో చిన్న చిన్న విషయాలు కూడా విశేషాలయేవి. అందులో భాగంగా "శాయి మీ అమ్మాయికి బొమ్మలు కావాలట" అంది.

"దానికి మాటలే రావు బొమ్మలెలా అడుగుతుంది. నీక్కావాలేమో, ఆడుకోడానికి ...." అన్నాడు శాయి రోహిణిని హాస్యం చేస్తూ.... హాస్యం పట్టించుకోకుండా "కాదు ఎదురింటి బాబు చేతిలోనుంచి బొమ్మలాక్కుంది. వాడు ఒకటే ఏడుపు వాళ్ళమ్మ "బొమ్మపట్టుకు దాని దగ్గరకెళ్ళకురా పాకరడం అంటే రాలేదుగాని, బొమ్మతో ఆడుకోవాలని వూహుందదా?" అంది. నేను కృప దగ్గరనుండి బొమ్మ తీసుకుని బాబుకిచ్చేసాను. నేను బొమ్మతీసుకుంటే కృప వొకటే ఏడుపు...." అంటూ యేవేవో చెప్తోంది రోహిణి. కృప చేస్తున్న డిమాండ్‌కి సంతోషంతో పొంగిపోతోంది. కృప కూడా మిగతా పిల్లల్లా పుట్టి పెరిగితే రోహిణి ఆనందం హద్దులు దాటేదేమో! పిల్లల పసితనపు చేష్టలకి, వాళ్ళ అమాయకపు డిమాండ్లకి యేతల్లితండ్రులు సంతోషించరు. కృపలో పసితనపు అందాల్ని, గడుసుదనపు వూహల్ని వెదుక్కోవలసి వచ్చినందుకే యీ బాధ. అలాకాక కృప ఆనందంగా అల్లరి చేస్తూ యింట్లో తిరిగితే యింటికి అందాన్ని, మనసుకి హాయిని కలిగించేదో కదా అనుకున్నాడు శాయి. కానీ అసలు సమస్యని అర్థం చేసుకోలేకపోయాడు.

గోడలు పట్టుకు నడుస్తున్న బాబు వాళ్ళ ఫ్లాటు దాటి మెట్లవేపు వెళ్ళిపోయాడని పక్కింటి పిన్నిగారు చేసిన హడావిడి, వాడు యింట్లో వస్తువుల్ని లాగేస్తూ, వాళ్ళమ్మని నిలబనీయకుండా చేస్తున్న అల్లరిని ... పక్కింటి పిన్నిగారు వర్ణిస్తోంటే ... రోహిణి మనసు గింగుర్లెత్తి, కుంపట్లో వేసిన మిరపకాయల్లా సురసురలాడిపోయింది.

కాలిన పెనమీద నీటి చుక్కలా బాబులో చురుకుదనం, రోహిణి మనసుకి కలవరపెట్టేది. కృపలో ఆ చురుకుదనం వెదికేది. ఆ క్షణం కృప మామూలు పిల్లకాదు అన్న విషయం మర్చిపోయేది. చురుకుదనంకి బదులు వెకిలి చేష్టలు, మంకుతనం ఆమె మనసుని కృంగదీసేవి. పిల్లనిచ్చి దేవుడు విధించిన శిక్షా అనిపించేది. కృప మంకుతనం మితిమీరడంతో కొట్టేది. అది శాయికి బాధ కలిగించేది. అన్నీ తెలిసీ సహనం కోల్పోవడం... అతనికి నచ్చలా... అందుకే రోహిణికి యెన్నోవిధాల నచ్చ చెప్పాడు. శాయి చెప్తున్న నీతులు, సహన పాఠాలూ చాలా రోజులు వింది. కానీ వో రోజు శాయితో "నాకు తెలుసు నువ్వేం చెప్పనక్కర లేదు" అంటూ యెదురు తిరిగింది.

"నీకు తెలిస్తే మరెందుకలా ప్రవర్తిస్తున్నావ్" అన్నాడు శాయి రోహిణి సమాధానానికి ఆశ్చర్యపోయి.

"నువ్వు ఇంట్లో కూర్చుని దానికి సేవ చెయ్యి... అప్పుడు చెప్పు నీతులు" అంది విసురుగా. "అంటే నేను కృపని పట్టించుకోడం లేదనా? నీ వుద్దేశం" అనడిగాడు. తను రోహిణి వెనకవుండి యెంత సాయం చేస్తున్నా.... రోహిణి ఈసడిస్తూ మాట్లాడ్డం వల్ల కష్టం వేసింది శాయికి. రోహిణి జవాబు చెప్పలేదు తనకేదో పనున్నట్టు అక్కడ్నుంచి తప్పుకుంది.

శాయికి రోహిణి మీద కోపం వచ్చింది. రోహిణి జవాబు చెప్పనందుకు కాదు. రోహిణి దగ్గర జవాబు లేదని అర్థం చేసుకున్నాడు. పాపం! రోహిణి యిలా యెందుకు ప్రవర్తిస్తోందో అతనికి తట్టలేదు. కాని అలా ప్రవర్తించడం మూర్ఖం అని అనుకున్నాడు. కృప అలా పుట్టడం దాని తప్పా? కృపని అర్థం చేసుకోమంటే అదేదో తన తప్పు అన్నట్టు, తన మీద విరుచుకు పడుతుందేం? మిగత పిల్లలకన్నా కృపకి యెక్కువ సేవ చేయాల్సి వచ్చేసరికి, తనేదో గొప్ప త్యాగం చేస్తున్నట్టు యెందుకనుకుంటోంది. కృప విషయంలో రోహిణి తనకి సహకరిస్తే, తనకి ఆనందం కాదా! కృప ప్రకృతి సిద్ధంగా అవిటిదైతే, రోహిణి అవిటిదాన్లా ప్రవర్తిస్తోంది! అసహనం అనే అవిటితనం రోహిణికి సంక్రమించినట్టుంది అని అనుకున్నాడే గాని, రోహిణి మనసుని పట్టుకోలేకపోయాడు.

శాయి ఆలోచనల్లో మునిగి తేలుతుండగానే ... రోహిణి పని ముగించుకువచ్చి గదిలో లైటార్పింది. అప్పుడే కృప మంచం మీద లేచి కూర్చుని మూలిగింది. ఆ మూలుక్కి అర్థం రోహిణికి బాగా తెలుసు. ఇక తప్పదురా భగవంతుడా అని వుసూరుమంటూ.... కృప మంచం దగ్గరకెళ్ళి కృపని లేపి బాత్రూంకి తీసుకెళ్ళి శుభ్రం చేసి తీసుకొచ్చి, బీరువాలోంచి మరో డ్రాయరు, జుబ్బాతీసి తొడిగి తను పడుకునే మంచం మీద పడుకోబెట్టింది.

రోహిణి చేసే పనులన్నీ శ్రద్ధగా గమనించాడు శాయి. కృపకి సేవ చెయ్యడం, మాటల్లో పలికినంత తేలిక కాదనిపించింది. అయినా బింకం చెడకుండా "కృపకి నేచర్ కాల్‌కి వచ్చినప్పుడు ఎలా తెలియచెయ్యాలో చెప్పి ప్రాక్టీస్ చేయిస్తున్నానన్నావు కదా" అన్నాడు.

రోహిణి శాయికి సమాధానం చెప్పలేదు. చెపితే నిజం చెప్పాలి. నిజాన్ని చెప్పి తనే తట్టుకోలేదు. పై వాళ్ళని మభ్యపెట్టడం చాలా తేలిక, తనని తాను మభ్య పెట్టుకోడం చాలా కష్టం, యెంత చేసినా యేదో లోపం, మనసులో వెలితి, అది కృప విషయంలోనే అలా అనిపిస్తోంది. యెదురింటి పిన్నిగారి కోడలు, యింత సేవా చేస్తుందికానీ ఆ బాబు నవ్వే చిరునవ్వుకి, చేసే చిలిపి చేష్టలకి మురిసి, సేవ చేసిన శ్రమంతా మర్చిపోతుంది. కానీ కృప ... కృపని తలుచుకుంటే హృదయంలోంచి దుఃఖం తన్నుకొచ్చింది. యెంత ఆపుకుందామన్నా ఆగక యేడుపు బైటకి వచ్చేసింది. మంచం మీద పడుకుని వెక్కివెక్కి యేడ్చేసింది.

తను విసుక్కున్నందుకే రోహిణి యేడుస్తోంది అనుకున్నాడు శాయి. అనునయంగా రోహిణి భుజం మీద చెయ్యేసి దగ్గరగా లాక్కున్నాడు. రోహిణి అతనిలోకి వొదిగినా దుఃఖం తగ్గలేదు. శాయికి కూడా యేం మాట్లాడాలో తెలియలేదు. సహనం గురించి మాట్లాడబుద్దేయలేదు. కాసేపటికి రోహిణే తేరుకుంది. శాయి చేతులు విడిపించుకు లేచి బాత్రూములోకి వెళ్ళి బేసిను దగ్గర చన్నీళ్ళతో మొహం కడుక్కుని, బెడ్‌రూమ్‌లోకి వచ్చి లైటేసింది. లైటు కళ్ళ మీద పడేసరికి, లేచి కూర్చున్నాడు శాయి.

"ఇల్లు మారిపోదాం శాయీ" అంది రోహిణి.

శాయి ఆశ్చర్యపోయాడు "యెందుకూ ఈ ఇల్లు బాగానే వుందిగా!" అన్నాడు.

"ఈ ఇల్లు కాదు బాగులేంది. ఈ వాతావరణం బాగులేదు. ప్రతి నిముషం చిత్రహింస పెడుతోంది. కృపని చూసినప్పుడు, కృప లోపాన్ని తలుచుకున్నప్పుడు. కృప మీద యెంతో జాలి కలుగుతోంది. యిలా పుట్టడం దాని తప్పా? దాన్ని విసుక్కుని, కోపగించుకుంటే వున్న లోపం పోతుందా? వెర్రిది, దాన్ననవసరంగా బాధ పెడుతున్నానేమో అనిపిస్తోంది. దానిలో వూహ పెరిగిందని అది స్లో లెర్నర్ అని నన్ను నేను మభ్యపెట్టుకు, నీకెన్నో అబద్దాలు చెప్పి నిన్ను మభ్యపెట్టాను. యెందుకలా చేస్తున్నానో అన్నది నాకే అర్థం కావడం లేదు, లేక అర్థం అవుతున్నా పట్టించుకోలేదు. కృప మీద జాలి, అభిమానం యెదురింటి బాబుని చూసినప్పుడల్లా యెక్కడికో తప్పుకుంటున్నాయ్! నన్ను నేను మభ్యపెట్టుకునే స్థితికి దిగజార్చినందుకు కోపం, యేదో తెలియని కసి చోటు చేసుకుంటున్నాయ్. ఈ ఇంట్లో కృపని సానుభూతితో అర్థం చేసుకోడం కుదరదు. ప్లీజ్ శాయి ఈ ఇంట్లోంచి పోదాం యెక్కడికేనా, ప్రత్యేకంగా వుండే యింటికి, అక్కడ నేనూ కృపా నువ్వూ తప్ప యింకెవ్వరూ వద్దు."

రోహిణి చెప్పిన దాన్ని నోరప్పగించి విన్నాడు శాయి. కొంత అర్థం అయింది కొంత అర్థం కాలేదు. అర్థమయినంత మేరా బాధపడ్డాడు. రోహిణి మీద జాలిపడ్డాడు. యిల్లు మారడానికి నిశ్చయించుకున్నాడు.

యిల్లు మారిన తరువాత రోహిణి పరిస్థితి మెరుగుపడింది. కృపని తొందపెట్టేవాళ్ళు లేరు. పోల్చి చూసుకోడానికి పక్క యిళ్ళల్లో చిన్న పిల్లలు లేరు యెవరేనా బంధువులు వచ్చినప్పుడు మాత్రం కృప స్లో లెర్నర్ అని చెప్పేవాళ్ళు. ఆ మాత్రం ఆత్మవంచన తప్పలేదు. కానీ వచ్చినవాళ్ళు తమ మాట నమ్మలేదని తెలుసు. అందుకే పరవంచన కాలేదు.

కృపకి మూడేళ్ళకి నడక వచ్చింది. వయసుతోపాటూ మొండితనం పెరిగింది. విచిత్రంగా ప్రవర్తిస్తూండేది. పళ్ళు తోముకుంటూ టూత్‌పేస్ట్ తినేసేది. నీళ్ళుపోసుకుంటూ సబ్బుని డ్రమ్ము నీళ్ళల్లో పడేసేది. యెవరూ లేకుండా చూసి శాయి పుస్తకాలు చింపేసేది. స్నానం చేసి బట్టలేసుకోకుండి యిల్లంతా తిరిగేది. వయసు పెరిగాక ఈ చేష్టలు చిలిపి చేష్టలుగా కాక మొండి చేష్టలుగా కనపడ్డాయి.

ఈ మొండి చేష్టలు మాన్పించే ప్రయత్నం రోహిణి చెయ్యకపోలేదు. కానీ కృపకి నచ్చేవికావు. ఆ నచ్చకపోవడం అన్నదాన్ని రోహిణి మీద వుమ్మో, తనని గిల్లుకునో, కరుచుకునో, అరిచో చూపించేది. వొక్కొక్కప్పుడు రిపిటీటివ్‌గా అరిచేది.

రోహిణి మీద కోపంతో వంటింటిలో టమాటాలు, తినుబండారాలు తెచ్చుకు తిన్నన్ని తిని మిగిలినవి యిల్లంతా పోసేది. అలా తినడం వల్ల విరోచనాలు పట్టుకునేవి.

కృప పెరుగుతున్న కొద్దీ, రోహిణి సమస్యలు పెరిగాయి. యిల్లు మారినంత మాత్రాన కృప మీద అభిమానం పెరుగుతుందని అనుకుంది. కాని కృపలో వెకిలితనం భరించలేని స్థితికి చేరుకుంది. కృపకి భయం నేర్పడం కోసం, కోపగించేది. తల్లి కోపాన్ని విసుగుని కృప అర్థం చేసుకుంటోంది అనుకునే సమయానికి ప్రకృతి మరోసారి వికటంగా నవ్వింది.

గుడిపాటి వెంకటాచలం గారు చెప్పినట్టు, చదివి చదివి గుడ్డివైన కళ్ళు, సబ్బుతో సుభ్రపడే

సంస్కృతి, మర్యాద కట్టుకున్న కళ్ళు, మనసుని వశం చేసుకు నలిపేస్తున్నాయి. లేకపోతే రోహిణి ఆరోజు అన్నం కలిపి తెచ్చి కృపకి తినిపిస్తూ .... అప్‌సెట్ అయి అన్నంతో సహా కంచాన్ని కృప నెత్తిమీద బోర్లించెయ్యదు. పెరిగిన నాగరికతకు సింబల్ డ్రాయింగ్ హాల్, అందులో సోఫా! ఆ సోఫా పాడయింది.

తల్లి తన నెత్తిమీద పళ్ళాన్ని యెందుకు బోర్లించిందో అర్థం కాలేదు కృపకి. కృపకి చాలా అర్థం కాలేదు. నెలానెలా రుతుస్రావం అవుతుందని ఆమెకి తెలీదు. అప్పుడు జాగ్రత్తగా వుండాలని తెలీదు. ముఖ్యంగా అలా యెందుకవుతుందో తెలీదు! తెలీదు! యేదీ తెలీదు!

అదే రోహిణి సమస్య! కృపలో వచ్చిన ఈ మార్పుకి కృపకి యేవిధంగా చెప్పాలి? యెలా చెప్తే అర్థమవుతుంది? చిన్నప్పటి మైల్‌స్టోన్స్ కూర్చోడం, పాకడం, నిలబడి అడుగులెయ్యడం అయితే నేర్పింది. ప్రాక్టీసు చెయ్యించింది. రుతుస్రావం గురించి యే భాషలో చెప్పాలి? యెలా ప్రాక్టీసు చేయించాలి? అన్నది తలుచుకు తలుచుకు కంపరం యెత్తి పోతోంది.

యెంతకనిపెట్టుకు చూస్తున్నా కృప పీరియడ్స్ చాలా యిరాటిక్‌గా వున్నాయి. యెప్పుడవుతోందో? యెలాంటి పరిస్థితులుల్లో అవుతోందో? తెలియడం లేదు. యింతవరకూ నిద్రలో అయి పక్కబట్టలే పాడు చేసింది. కానీ యిప్పుడు సోఫా పాడయింది. ఆ మచ్చపోదు. అది హాల్లో వుంచలేదు. సోఫా కవరు మార్చలేదు. సోఫా కవరు మార్చాలి. ఇంకో కవరు వెయ్యాలి? ఈ సమస్య యెలా తీరుతుంది? కృపని సోఫాలో కూర్చోపెట్టకుండా, యింకో కుర్చీలో కూర్చోపెడితే వూరుకోడం లేదు. వచ్చి సోఫాలో తల్లి పక్కనో తండ్రిపక్కనో కూర్చుంటోంది! ఇలా యిన్నాళ్ళు? యేదిదారి? కృప యెన్నాళ్ళకి తెలుసుకుంటుంది? ఈ నరకం నుండి విముక్తి యెప్పుడు? మామూలు పిల్లలకే యెవరూ చెప్పలేం, కాలక్రమాన వూహ పెరిగి తెలుసుకుంటారు. ఈ విషయాన్ని సిగ్గుతో కొందరు, అసహ్యంతో కొందరు, జుగుప్సతో కొందరు సీక్రెసీ మెంటెయిన్ చేస్తారు. సీక్రెసీ యెవరికీ తెలియకుండా? ప్రతి ఆడదానికి ఈ విషయం దీని బాధ తెలుసు. మరి, మగాడికి తెలియకుండా! యెందుకు? ఈ విషయంలో యేదో ఇన్ఫీరియారిటీ వుందా? అందుకా? యేమిటీ తేడా? యెందుకో కృప రజస్వల అయినదగ్గరనుండీ శాయి దూరంగా వుంటున్నాడు. అది సహజమే అన్నట్టు, తనూ వూరుకుంది, వొంటరిదైపోయింది. ఈ మూడ్రోజులు కృపని శుభ్రం చెయ్యడం తయారు చెయ్యడం తన బాధ్యతే! ఈ మూడురోజుల సేవలో వికారపెడ్తోంది! జుగుప్స కలిగిస్తోంది! కాని యేది దారి? శాపంలా తగిలింది. శాయికి చూచాయగా తను పడ్తున్న బాధని చెప్పింది. శాయి విన్నా యేమి చెయ్యగలడు? పరిష్కారం లేని సమస్య యిది. అందుకే ఇంక శాయికి కూడా చెప్పడం మానుకుంది. అతలాకుతలంగా పైకి వస్తున్న భావాల్ని అణచిపెడ్తోంది. దానివల్ల అప్పుడప్పుడు కోపం విసుగు హద్దులు మీరుతున్నాయి. వాటిని కృపమీద చూపిస్తోంది. అంతా అయాక పశ్చాత్తాప పడుతోంది. దాన్ని శాయితో చెప్తే, యింతకుముందులా సహనపాఠాలు చెప్పలేదు శాయి. “మామూలు పిల్లల్నయినా, తల్లితండ్రులు కొట్టరా, కోప్పడ్రా... కొట్టినా, కోప్పడినా కృప గ్రహించలేదు. అందుకే బాధ! కొట్టడం, కోప్పడ్డం మన రిఫ్లెక్స్ యాక్షన్సేగాని, పిల్లలంటే యిష్టం లేక కాదుగా!” అంటూ అనునయిస్తున్నాడు. ఈ అనునయాలు, శాంతవచనాలూ, మలి మెన్సురేషన్ వరకే, యెక్కడో యేదో మరుపు పొర. దీనికి విముక్తి యెప్పుడు? అసలు విముక్తి వుందా?

బృహతి రోహిణికి అక్కవుతుంది. దంపతులిద్దరూ రోహిణింటికి వచ్చారు. బృహతికి బృహతి

మొగుడికీ యిద్దరికీ కృప గురించి తెలుసు. అందుకే వాళ్ళరాక యే యిబ్బందీ కలిగించదు.

కానీ కృపలో వెకిలివేషాలు యెవర్నేనా కదిలిస్తాయి. కృపని చూసి వాళ్ళు నవ్వినప్పుడల్లా రోహిణికి, శాయికి యిబ్బంది కలిగేది.

కృపని సంస్కరించడానికి తామెన్ని కష్టాలు పడ్డామో! వారిద్దరికీ వివరించడం మొదలుపెట్టారు.

యింటికి వచ్చినవాళ్ళకి గుడ్‌మార్నింగ్, గుడ్‌బై చెప్తోందని, నిద్రలేచాక పక్క బట్టలు మడత పెడ్తోందని, యేం వూసుకోకపోతే చక్కగా తయారై వచ్చి కూర్చుని టి.వి. పెట్టుకు చూస్తోందని, వంటింటి పనుల్లో సాయం చేస్తోందని, యిలా ఎన్నో చెప్పారు, చెప్తున్నారు. చెప్పినవే చెప్తున్నామని గుర్తించలేకపోయారు. యేదో తప్పుచేసి సంజాయిషీ చెప్పుకున్నట్టు వుంటోందని గుర్తించలేకపోయారు.

బృహతి ఆమె భర్తా వెళ్ళిపోయే రోజొచ్చింది. ఆ రోజున అక్కకి చీరపెడ్దామని, ఒక పళ్ళెంలో చీర, పళ్ళూ పసుపు కుంకుమ పెట్టి, బృహతికి తత్కాలికంగా యిచ్చిన గదిలోకి వెళ్ళామని బయలుదేరింది. గది తలుపేసుంది. లోపలనుండి మాటలు వినపడుతున్నాయి. సంస్కారం అనిపించకపోయినా, ఆ మాటల్లో కృప ప్రస్తావన రావడంతో ... తలుపు బైటే నిలబడిపోయింది రోహిణి.

“నాకెలాగూ చీరపెడుతుంది రోహిణి, మనం కూడా ఏదేనా కొని కృపకి యిస్తే బావుండేది” అంది బృహతి.

“యేంకొనిస్తాం? యేంకొనిచ్చినా విలువేం వుంటుంది. ఆ వెర్రిది రెండ్రోజుల్లో పాడుచేస్తుంది” అన్నాడాయన.

“మెల్లగా మాట్లాడండి, రోహిణి వింటుంది”

“మెల్లగా మాట్లాడినా గట్టిగా మాట్లాడినా కృప మెంటల్లీ రిటార్డెడ్‌దే, మీ చెల్లీ అతనూ కృప గురించి యెన్ని చెప్పినా, నిజం దాగదు! కృప చేసే చేష్టలు. మనం నాలుగు రోజులనుండీ చూస్తున్నాం. వాళ్ళు చెప్పిందేదో నమ్మేస్తాం మనం వెర్రివాళ్ళం అనుకుంటే అది వాళ్ళ భ్రమ”

“పోన్లెండి నమ్మకండి నమ్మినట్టు నటిస్తే యేంపోయింది. మిమ్మల్ని వెర్రివాళ్ళని చెయ్యడం వాళ్ళ వుద్దేశం కాదు” అంది బృహతి మొగుడి నిక్కచ్చితనం నచ్చక.

“అందుకే కృపకి యేదోకొనిచ్చేకన్నా, డబ్బులు దానిచేతిలో పెడితే, వాళ్ళేవాడుకుంటారు. వాళ్ళకి తృప్తికూడా. వాళ్ళకి తెలియదా అది నార్మల్ పిల్లకాదని, అంతేకాదు బృహతీ యిలాంటి పిల్లలు యెక్కువకాలం బతకరు ... ఈ రుణం యింకెన్నాళ్ళో....” ఆయనింకేదో చెప్తూనేవున్నాడు.

ఆఖరి వాక్యం విన్న తరువాత రోహిణి మనసంతా పాడయింది. లోపలికి వెళ్ళబుద్దెయ్యలేదు. డ్రాయింగ్‌హాల్ లోకి వచ్చి పళ్ళెం సెంట్రల్ టేబుల్‌మీద పెట్టి సోఫాలో కూర్చుంది. “యిలాంటి పిల్లలు యెక్కువకాలం బతకరు” అన్న వాక్యం చెవుల్లో మార్మోగుతోంది.

దగ్గర వాళ్ళు కూడా యిలా ఆలోచిస్తారని అనుకోలేకపోయింది. యిది శాయికి తెలిస్తే యేమంటాడు? రోహిణి ఆలోచనల్లో సతమతమవుతూండగానే, బెడ్‌రూంలోంచి శాయి, గెస్ట్‌రూంలోంచి బృహతి,

ఆమె భర్తా డ్రాయింగ్‌హాల్‌లోకి వచ్చారు.

డ్రాయింగ్‌హాల్లో కూర్చున్న రోహిణిని చూసి “అదేమిటి అవి యిస్తానని గెస్ట్‌రూంకి వెళ్ళావు, యివ్వలేదా?” అన్నాడు.

రోహిణి జవాబు చెప్పలేదు. కానీ బృహతి వులిక్కిపడింది. రోహిణిని జాగ్రత్తగా పరిశీలించింది. మ్లానవదనంతో వున్న రోహిణిని చూడగానే, ఆమె తమ మాటలు వింటని అర్థం చేసుకుంది. ఆమె భర్త మాత్రం ఇవేం పట్టించుకోలేదు. శాయితో మాటల్లో పడిపోయాడు.

రోహిణి అక్కకు బొట్టుపెట్టి, చీర జాకెట్టు పళ్ళు అందించింది. అవన్నీ తీసుకు బేగ్‌లో పెట్టుకుంది బృహతి. అది గమనించిన బృహతి భర్త జేబులోంచి రెండొందల రూపాయలు తీసి బృహతికిచ్చాడు. బృహతి వాటిని పుచ్చుకుని, అప్రయత్నంగా రోహిణి మొహంలోకి చూసింది. రోహిణి యెటో చూస్తోంది. జరిగేదేదో నాకు తెల్సు అన్నట్టుగా వున్నాయి ఆమె ముఖకవళికలు. సోఫాలో కూర్చున్న కృప సీరియస్‌గా టి.వి. చూస్తోంది.

తను తీసుకున్న రెండొందలూ తిరిగి మొగుడి జేబులో పెట్టేసింది బృహతి. ఆయన ఆశ్చర్యపోయి బృహతిని ప్రశ్నార్థకంగా చూసాడు. బృహతి చిర్నవ్వు నవ్వి, కృప దగ్గరకెళ్ళి, కృప చెయ్యిపట్టుకు గెస్ట్‌రూములోకి తీసుకెళ్ళింది.

పదినిముషాలు తర్వాత కృప బృహతి బైటకొచ్చారు. బైటకొచ్చిన కృప మొహంలో మార్పొచ్చింది.

తల్లిని చూడగానే వో వెర్రినవ్వు నవ్వింది. ఆ వెర్రి నవ్వులో ఆనందం వుంది. అది తేలికగా పసిగట్టగలిగింది రోహిణి.

అంత వరకూ బృహతి చెవులకున్న బుట్టరింగులు యిప్పుడు కృప చెవులకున్నాయి. బృహతి చెవులు కాళీగా వున్నాయి.

రోహిణికి బృహతిని చూడగానే దుఃఖం ఆగలేదు. “అక్కా” అని కౌగిలించుకుంది. ఆ తర్వాత మాటలురాక గొంతు పూడకుపోయింది. తన చేష్టలతో అస్వాభివక జీవితం గడుపుతున్న కృపని స్వీకరిస్తూ స్వాభావికంగా అక్కచూపిన అభిమానానికి ఆప్యాయతకి రోహిణి చలించింది.

రోహిణి భుజం మీద ఆప్యాయంగా తట్టి, కృపని బుగ్గమీద ముద్దుపెట్టుకుని “తీరిక చేసుకు, ముగ్గురూ మావూరు రండి మరిది గారూ” అంటూ శాయికి వీడ్కోలు చెప్పి, మొగుడి వెనకాల బయలుదేరింది బృహతి.